ఓం

శ్రీరామ

శ్రీ చన్ద్రమౌళీశ్వరాయ నమః

# శ్రీ వేదధర్మ పరిపాలనా సభ ( Regd ), కుంభకోణమ్

దశమ ప్రచురణ

స్వస్తి శ్రీ చాన్ద్రమాన సర్వజిన్నామ సంవత్సర భాద్రపద బహుళ ఏకాదశి శుక్రవారము (10-10-1947)

గమనిక :- ఈ స్వస్తి శ్రీ ఖర నామ సంవత్సర ఆశ్వయుజ శుక్ల సప్తమీ సోమవారము (03-10-2011) నాడు సరస్వతీ పూజ

## శ్రీ సరస్వతీ పూజ

శరన్నవరాత్రులలో, మహానవమి నాడు శ్రీ సరస్వతీ పూజ చేసుకుంటాము. శ్రీ మహాసరస్వతి పరమశివుని సోదరి. పార్వతీదేవి విష్ణుమూర్తి సోదరి. వేదములలో స్ఫటికమువలె స్వచ్ఛమైన పరమేశ్వరుని ఆకృతి, జటాజూటము, చన్ద్రరేఖ, త్రినేత్రముల ప్రసక్తియున్నది. ఆ భగవంతుని జ్ఞానప్రదమగు రూపమే శ్రీ దక్షిణామూర్తి. ఆ మూర్తి చేతిలోని పుస్తక ప్రసక్తి కూడ వేదములలో ఉన్నది. ఆ సదాశివుడు సమస్త విద్యలకు (విజ్ఞానములకు) ఈశానుడు (ప్రభువు) అని వేదము స్తుతించుచున్నది. ఈ లక్షణములన్నియు శ్రీ సరస్వతీదేవికి కూడ అన్వయిస్తాయి. పుస్తకము, స్ఫటికమాల, శ్వేతవర్ణము, జటాజూటము, చన్ద్రరేఖ, త్రినేత్రములు, జ్ఞానప్రదానము ఇవన్నీ పరమేశ్వరునికి, సరస్వతీదేవికి సమాన లక్షణములే. కోరికలు మనసుని క్షోభింపజేసి, జ్ఞానాన్ని ప్రతిబంధిస్తాయి. తృతీయనేత్రము కోరికలని (కామాన్ని) దహించి వేసి జ్ఞాన ప్రాప్తికి సహాయమౌతుంది. సూర్యుడు చాలా కాంతిమంతుడే గాని, ఆ కాంతి వేడి, తాపాన్ని కలిగిస్తుంది. చన్ద్రరేఖ వెన్నెలని (వెలుగుని), దానితో పాటు ఆహ్లాదకరమైన చల్లతనాన్ని కూడ అందిస్తుంది. చన్ద్రకళల అభివృద్ధి జ్ఞానాభివృద్ధిని సూచిస్తుంది. స్ఫటికము స్వచ్ఛతని, దోషరాహిత్యాన్ని సూచిస్తుంది.

ఈ లక్షణాలన్నీ సకల విద్యలకీ ఈశానుడు (ప్రభువు) అయిన పరమేశ్వరునికి, మరియు సకల విద్యాస్వరూపిణి అయిన సరస్వతీదేవికి కూడా సమానముగనే అన్వయిస్తాయి. నిర్దుష్టము, నిర్మలము అయిన జ్ఞానాన్ని ప్రసాదించే శ్రీ సరస్వతీదేవికి **శారద** అని మరియొక పేరున్నది. ఉత్తర భారతదేశమున భారతమాత ముఖారవిందముపై తిలకస్థానమైన కాశ్మీరమున ఒక శారదా పీఠము సుప్రసిద్ధమై విరాజిల్లుచున్నది. అట్లే దక్షిణ భారతదేశమున కాఞ్చీపురమున కామకోటి పీఠము సుప్రసిద్ధమై విరాజిల్లుచున్నది. **నగరేషు కాఞ్చీ** అనగా నగరములన్నిట **కాఞ్చీనగరము** సర్వోత్తమమయినదని విజ్ఞుల మాట. అట్టి కాఞ్చీపురమున నున్న కామకోటి పీఠమే దక్షిణ భారతదేశపు శారదా పీఠము.

శరత్కాలమున భారతదేశము సుఖశాంతులతో, చక్కని చల్లని వెన్నెలతో శోభాయమానంగా ఉంటుంది. ఫాల్గున, చైత్రముల నాటికి దక్షిణ భారతమునకంటె ఉత్తరభారతమున వేడి చాలా ఎక్కువగా ఉంటుంది. మార్గశిర మాస ప్రాంతంలో అచట చలి విపరీతం. వైశాఖ, జ్యేష్ఠ మాసములలోని మధ్యభారత దేశములోని విన్ధ్య పర్వత ప్రాంతములలోను, దక్షిణాన కూర్గు, మళయాళ ప్రాంతములలోని సహ్య పర్వతతీరాలలోను

ఎడతెరిపిలేని పెద్ద పెద్ద వర్షాలు ఉంటాయి. కానీ, ఆశ్వయుజ శుక్ల పక్షం వచ్చేసరికి, శరత్కాలారంభమై కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు, కలకత్తా నుండి ముంబాయి వరకు భారతదేశంలోని అన్ని ప్రాంతాలు నిర్మలంగా, ప్రశాంతంగా విద్యాధిదేవత అయిన శారద (సరస్వతీ) రూపాన్ని సంతరించుకుని శోభిస్తూ ఉంటాయి. వాతావరణంలో ప్రాంతీయ భేదాలు లేకుండా దేశమంతా ఒకే విధంగా సుఖకరమైన ఎండలు, వెన్నెలు, తెల్లని మేఘాలతో పగళ్ళు, రాత్రులు అన్నీ చాల ఆహ్లాదకరంగా ఉండి భారతదేశము మొత్తము సరస్వతీ దేవతా స్వరూపాన్ని సంతరించుచున్నట్లుగ శోభిల్లుతూ ఉంటుంది.

ఇలా బాహ్య వాతావరణం అంతా నిర్మలంగా ప్రశాంతంగా ఉన్న సమయంలోనే మనం కనుక మన మనస్సుని  కూడా అలాగే నిర్మలంగా, ప్రశాంతంగా మలచుకున్నట్లైతే ఈ బాహ్యాభ్యన్తర నైర్మల్య ప్రశాన్తతల సమ్మేళనమున మనము సులభముగ శ్రీ శారదా దేవతానుగ్రహమును పొందగలము. ఉదాహరణకి - రోజు మొత్తంమీద ప్రభాత, సాయం సంధ్యా సమయాలలో ప్రశాంతత ఎక్కువ. అందుకని, మన పెద్దవాళ్ళు నిద్రలేస్తూనే **హరి నారాయణ గోవింద** అంటూ హరినామస్మరణ చేసేవాళ్ళు. అలాగే సాయంత్రం వేళ శివాలయాలకి వెళ్ళిగాని, ఇంటి పెరటిలో తులశమ్మ దగ్గరగాని విభూతిధారణ చేసి, కాసేపు భగవద్ధ్యానంలో కూర్చునే వాళ్ళు. సాయం సంధ్యా సమయంలో విష్ణ్వాలయాలలో తలుపులు మూసేవాళ్ళు. ఇచటి వైదిక మర్మమేమంటే - సృష్టి స్థితి లయములన్నిటికి పరమేశ్వరుడే కారణభూతుడు. లయమంటే నాశనమని కాదు. మనం గాఢ నిద్రలోనున్నపుడేమి జరుగుచున్నది? మన మనస్సు, బుద్ధి, జ్ఞానేన్ద్రియాలు అన్నీ వాటివాటి పనులను మానివేసి, నిష్క్రియములై, వాటి వాటి శక్తులన్నిటినీ ఒకే ఒక జీవచైతన్యములో లీనం చేసుకుని ఉంటాయి. చరాచర భూతములు (ప్రాణులు - అప్రాణుల సమాహారమైన ఈ సృష్టి మొత్తము అనగా ప్రపంచము) తనకు ఆది కారణమైన ఆ పరమశివునిలో లీనమగుటయే **లయము**. ప్రతిరోజు మనం చూస్తూనే ఉన్నాం - పగలు ముగిసేవేళ ఏమౌతున్నది? వేడి తగ్గిపోతుంది. చప్పుళ్ళు అణగారుతాయి. పశుపక్ష్యాదులు తమ తమ గూళ్ళకి చేరి విశ్రాంతిని పొందబోతాయి. ఇది శివతత్త్వ ప్రధానమైన కాలము. పగలంతా ప్రాపంచిక - సాంసారిక వ్యవహారాలలో తిరిగి తిరిగి అలసిసొలసిపోయిన మన మనస్సనే పక్షికి కాస్త విశ్రాన్తిని కలిగించాలంటే, దానిని బాహ్యప్రపంచం విశ్రాన్తికి ఉపక్రమించే ఆ సాయంసంధ్యా సమయాలలో - ప్రపంచానికీ, సృష్టికి విశ్రాన్తిని ప్రసాదించే ఆ పరమశివుని సన్నిధికే చేర్చాలి. శివతత్త్వానుసన్ధానం, శివధ్యాన స్మరణలలోనికి మనస్సుని దింపాలి. అపుడు సులభంగా - సహజంగా మనస్సు విశ్రాంతిని, ప్రశాంతిని పొందుతుంది. మన పెద్దవాళ్ళు సాయంసంధ్యా సమయాలలో శివధ్యాన తత్పరులవటానికి ఇదే కారణం. సముద్రంలో ఓడని నడిపే నావికునికి, గాలి తూర్పునుండి వీచే సమయాలలో - పడమటికి ప్రయాణించటం సుఖకరము. సహజమే కదా. అట్లే - బాహ్య ప్రకృతి మొత్తము సమశీతోష్ణమై, చక్కని గాలి - వెలుతురులతో ప్రశాన్త సుభగముగ శోభిల్లే శరత్కాలము రాగానే - అట్టి ప్రశాన్త సుభగాకారయైన సరస్వతీదేవిని ధ్యానించి, ఆరాధించి - జ్ఞాన ప్రకాశ ప్రశాన్తులను పొందగోరటం సహజము - సులభము.

## సరస్వతీ పూజా విధానము

ఆశ్వయుజ శుక్ల పక్షమున మూల నక్షత్రమునాడు చక్కని పీఠముపై తెల్లని శుభ్రమైన పట్టు వస్త్రాన్ని పరచి, దానిపై పుస్తకాలని పేర్చిపెట్టాలి. ఆ పుస్తకాలపై సరస్వతీదేవిని ఆహ్వానించాలి. ఆహ్వానించే ముందు కాస్త ధ్యానం చేయాలి. అందుకై చేతిలో అక్షతలు, పూలు పెట్టుకుని, పూజాపీఠానికి ముందు సుఖాసనంలో కూర్చుని – వెన్నుపూస, మెడ, తల ఒకే వరుసలో ఉండేటట్లు నిటారుగా కూర్చుని, మన ఎదురుగా, ఆ పుస్తకాలలో సరస్వతీ అమ్మవారు ప్రకాశిస్తున్నట్లు భావించాలి. ఈ క్రింది శ్లోకాలని చదువుచూ – వాటి అర్థాన్ని గుర్తుచేసుకుంటూ పూలని, అక్షతలని ఆ పుస్తకరూప సరస్వతీదేవిపై వేసి – అమ్మవారు ఆ దివ్య ప్రకాశము మన శ్వాసరూపంలో మనలోనికి ప్రవేశిస్తున్నట్లు భావించుకోవాలి.

### ధ్యాన శ్లోకములు

1. **నమస్కృత్య జగత్పూజ్యాం శారదాం విశద ప్రభామ్ ।**
**శ్రిత పద్మాసనాం దేవీం త్ర్యంబకీం శశి భూషణామ్ ॥**

పద్మముపై కూర్చుని యున్నది, మూడు కళ్ళతో చన్ద్ర రేఖతో, నిర్మలమైన కాంతితో శోభిల్లుచున్నది – సమస్త జగత్తులకు (బ్రహ్మ విష్ణు మహేశ్వరాది సమస్త దేవతలకు కూడ) పూజ్యురాలైన శారదా (సరస్వతీ) అమ్మవారిని నమస్కరించుచున్నాను – అని ఈ శ్లోక భావము.

ఇది **వ్రత చూడామణి** యను గ్రన్థమున నున్న శ్లోకము.

2. **ప్రణవాసన మారూఢాం తదర్థత్వేన నిశ్చితామ్ ।**
**సితేన దర్పణాభేన వస్త్రేణ పరిభూషితామ్ ॥**
**శబ్దబ్రహ్మాత్మికాం దేవీం శరచ్చన్ద్ర నిభాననామ్ ॥**

ఇది **కల్పమఞ్జరి** యను గ్రన్థములోనిది.

ప్రణవమే (ఓంకారమే) అమ్మవారి ఆసనం. ఆ ఓంకారము తెలియజేసే వస్తువు అమ్మవారే అని ఉపనిషత్తులు నిర్ణయించి చెప్పుచున్నాయి. శబ్దము (వేదము / నాదము) ఆమె స్వరూపము. సాకార రూపమున ఆమె ముఖము శరత్కాల చన్ద్రుని వలె ఆహ్లాదకరమైనది. ఆమె అద్దమువలె స్వచ్ఛముగా తెల్లగానున్న వస్త్రముతో భాసిల్లుచున్నది. అట్టి దేవిని ధ్యానించుచున్నాను – అని ఈ శ్లోక భావము.

ఇలా ధ్యానించిన పిదప – ఆహ్వానించాలి.

**అత్రాగచ్ఛ జగద్వన్ద్యే సర్వలోకైక పూజితే ।**
**మయా కృతామిమాం పూజాం సంగృహాణ సరస్వతి ॥**

సమస్త లోకాలచే పూజింపదగిన దానివి, అందరిచే పూజింపబడే ఏకైక దేవతవూ అయిన ఓ సరస్వతీ దేవీ, మా ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడికి విచ్చేసి మా పూజని స్వీకరించు తల్లీ! (అని దీని భావం).

మూల నక్షత్రం రోజున ఇలా అమ్మవారిని ఆహ్వానించి, లఘుపూజ చేయాలి. మరునాడు పూర్వాషాఢనాడు కూడా పునః పూజ చేయాలి. మహానవమినాడు ఉత్తరాషాఢలో మహానైవేద్యాన్ని సిద్ధం

చేసుకుని – ఆసనము, పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము, మధుపర్కము, పంచామృతస్నానము, వస్త్రయుగ్మము (పట్టుచీర, రవిక), ఉపవీతము (వల్లెవాటు), ఆభరణములు, పసుపు, కుంకుమ, కాటుక, గంధము, అక్షతలు, పూలమాలలు సమర్పించి, పుష్పాదులతో పూజించి, ధూప, దీప, నైవేద్య, తాంబూలాదుల సమర్పించి, కర్పూర హారతినిచ్చి, మన్త్రపుష్పాంజలి నొసగి, ప్రదక్షిణ నమస్కారాలను చేయాలి. ఆయా ఉపచారాలకై పూజా గ్రంథాలలో శ్లోకాలు ఉంటాయి. వాటితో చేయాలి.

పూజలో ముందుగ అష్టవిధ పుష్పాలని సమర్పించాలి. అవి –

**అర్క చంపక పున్నాగ నన్ద్యావర్తం చ పాటలం ।**

**బృహతీ కరవీరం చ ద్రోణపుష్పాణి చార్చయేత్ ॥**

1. అర్క (జిల్లేడు), 2. చంపక (సంపెంగ), 3. పున్నాగ, 4. నన్ద్యావర్త (నన్దివర్ధన), 5. పాటల (కలికొట్టు/ఎఱ్ఱలొద్దుగ), 6. బృహతి (వాకుడు), 7. కరవీర (ఎఱ్ఱగన్నేరు), 8. ద్రోణ (తుమ్మి) అనునవి. ఈ సమర్పణ ఈ క్రింది విధముగ అమ్మవారి ఎనిమిది నామములను స్మరించుచూ చేయాలి –

| | | | |
|---|---|---|---|
| **1.** | **సరస్వత్యై నమః** | **–** | **అర్కపుష్పం పూజయామి.** |
| **2.** | **భారత్యై నమః** | **–** | **చంపక పుష్పం పూజయామి.** |
| **3.** | **వాగ్దేవతాయై నమః** | **–** | **పున్నాగ పుష్పం పూజయామి.** |
| **4.** | **మాతృకాయై నమః** | **–** | **నన్ద్యావర్త పుష్పం పూజయామి.** |
| **5.** | **హంసాసనాయై నమః** | **–** | **పాటల పుష్పం పూజయామి.** |
| **6.** | **చతుర్ముఖ ప్రియాయై నమః** | **–** | **బృహతీ పుష్పం పూజయామి.** |
| **7.** | **వేద శాస్త్రార్థ తత్త్వజ్ఞాయై నమః** | **–** | **కరవీర పుష్పం పూజయామి.** |
| **8.** | **సకల విద్యాధిదేవతాయై నమః** | **–** | **ద్రోణ పుష్పం పూజయామి.** |

ఆపైన సర్వాంగ పూజ, అష్టోత్తర శతనామ పూజ, సహస్రనామ పూజలు (వీలువెంట) చేయాలి. చివరకి –

**1.** **దోర్భిర్యుక్తా చతుర్భిః స్ఫటిక మణిమయీ మక్షమాలాం దధానా**
**హస్తేనైకేన పద్మం సితమపి చ శుకం పుస్తకం చాపరేణ ।**
**భాసా కున్దేన్దుశఙ్ఖ స్ఫటిక మణినిభా భాసమానాఽసమానా**
**సా మే వాగ్దేవతేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా ॥**

**2.** **చతుర్దశసు విద్యాసు రమతే యా సరస్వతీ ।**
**సా దేవీ కృపయా మహ్యం జిహ్వాసిద్ధిం కరోతు చ ॥**

అను శ్లోకాలతోనూ, ఇంకా కల్ప (పూజా) గ్రంథాలలోని మరికొన్ని శ్లోకాలతోనూ (అర్థ భావన చేస్తూ) ప్రార్థన చేయాలి.

పై శ్లోకాల భావం :–

1. అమ్మవారు – నాలుగు చేతులలో ఒక దానితో స్ఫటిక మణులతో చేసిన అక్షమాలని (జపమాలని),

మరొక చేతితో తెల్లని పద్మాన్ని, మరొక చేతితో చిలుకనీ, నాలుగవ చేతితో పుస్తకాన్ని ధరించియున్నది. కున్దములు (మొల్లపూలు), చన్ద్రుడు, స్ఫటికమణి, శంఖము వీటి వీటి రంగుల (కాంతుల) లోని శోభతో వెలుగొందుచున్నది. కాంతి, శక్తి, దయ ఇలా అన్ని విషయాలలో ఆమె సాటిలేని మేటి. వాగ్దేవత (విద్యాధీశ్వరి యైన) ఆ సరస్వతీ తల్లి సర్వదా నిండు దయతో నా ముఖము నందు నివసించుచుండు గాక! (సమస్త శుభ విద్యలు – అనగా అందరికి అన్ని విధముల శుభమును కలిగించే విద్యలన్నీ నాకు లభించి – సర్వదా నా స్ఫురణలో ఉండాలి – అని భావం).

2. పదునాలుగు విద్యలలోను నిత్యం క్రీడిస్తూ ఆనందిస్తూ ఉండే ఆ సరస్వతి – దయచేసి – నాకు వాక్సిద్ధిని అనుగ్రహించాలి. (అనగా విద్యలన్నీ నా వాక్కుకి అందుతూ ఉండాలి).

(నాలుగు వేదాలు + ఆరు వేదాంగాలు + తర్క + మీమాంసా శాస్త్రాలు + పురాణేతిహాసాలు + ధర్మశాస్త్రాలు = ఈ పదునాలుగు మన భారతీయుల విద్యలు. చతుర్దశ విద్యలు. అందరికి అన్ని విధములైన శుభములను కలిగించే విద్యలు).

వేదాంగాలు ఆరు ఏవనగా – 1. శిక్ష (వేదోచ్చారణ పద్ధతిని తెలిపేది), 2. వ్యాకరణమ్ (మాటల స్వరూప విశేషాలని తెలిపేది), 3. జ్యోతిషమ్ (కాల విశేషాలని తెలిపేది), 4. నిరుక్తము (మాటల అర్థాన్ని నిరూపించేది), 5. ఛన్దస్సు (అక్షర సముదాయముల విశేష ప్రభావాన్ని తెలిపేది), 6. కల్పము (యజ్ఞయాగములు, వివాహోపనయనాది క్రియా కలాపములు, పూజలు మున్నగువాని విధి విధానములను తెలిపేది).

పరమాత్మ స్వతః నిరాకారుడే అయినను – భక్తులననుగ్రహించుటకై – వారి వారి భావానుగుణములైన దివ్య రూపాలని ధరిస్తూనే ఉంటాడు. కరిగిన నెయ్యి చల్లారినాక తెల్లగా ముద్దగా అయినట్లే – పరమాత్మ కూడ భక్తుల చల్లని ప్రేమాభిమానాలకి అనుగుణంగా దివ్యమైన స్వచ్ఛమైన శ్వేతవర్ణాన్ని స్వీకరిస్తాడు.

సరస్వతీ దేవిని ధ్యానించేటప్పుడు, ఆరాధించేటప్పుడు అకారాది క్షకారాన్త మాత్రా వర్ణములే (అక్షరములే) సరస్వతీ రూపమున మూర్తీభవించినట్లు భావించాలి.

సరస్వతీదేవిని ఈ విధంగా పూజించి – మహా నవమినాడు అన్నబలిని (నైవేద్యాన్ని) సమర్పించి, శ్రవణ నక్షత్రమున ఉద్వాసన చెప్పాలి. చెప్పి పుస్తకాలని చదువుకొనటం మొదలు పెట్టాలి. (దసరాలలోని) మూల – పూర్వాషాఢ – ఉత్తరాషాఢలలో మౌనము పాటించి – శ్రవణం నాడు పుస్తక పఠనం ప్రారంభిస్తే చదువులు బాగా వస్తాయి. మాటలలో నేర్పరితనం కలుగుతుంది. చదువుల సారం వంటబట్టి జ్ఞానం సత్ఫలితాలనిస్తుంది.

**విమలపటీ కమలకుటీ ! పుస్తక రుద్రాక్ష శస్త హస్త పుటీ !!**

**కామాక్షి పక్ష్మలాక్షీ ! కలిత విపఞ్చీ విభాసి వైరించీ !!**

ఓ కామాక్షీ ! (క్రీగంటి చూపులతోటే కోరికలను ఈడేర్చే తల్లీ) నీవు శుభ్రమైన (తెల్లని) వస్త్రముతో – కమలాసనమున కూర్చుండి – చేతులలో పుస్తకమును రుద్రాక్షమాలని ధరించి అందమైన కళ్ళు గలిగియుండి, వీణను చేబట్టి సరస్వతీ రూపమున విరాజిల్లుచున్నావు.

ఇది శ్రీ **పి.ఆర్. కన్నన్ (నవీ ముంబాయి)** వారి ఇంగ్లీషు అనువాదము ఆధారముగా.